జగనన్నకు నీరాజనం

- అట్టహాసంగా జగనన్నకు స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు
- కరచాలనం చేసేందుకు ఎగబడ్డ అభిమానులు
- చిరునవ్వుతో అభివాదం చేసుకుంటూ ముందుకు సాగిన వైఎస్ జగన్

రహదారులపై జనసంద్రం పోటెత్తింది. తమ అభిమాన నేతను చూసేందుకు మండే ఎండను సైతం లెక్కచేయక అభిమానులు రోడ్లపై బారులు తీరారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌పై అడుగడుగునా అభిమానులు పూల వర్షం కురిపించారు. కరచాలనం చేసేందుకు కాన్వాయ్ చుట్టూ చేరి జగన్ 2.0 లోడింగ్ అంటూ కేరింతలు కొడుతూ గర్జించారు. స్వచ్ఛందంగా అభిమానులు, పార్టీ శ్రేణులు, నాయకులు తరలిరావడంతో రహదారులు, పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి.


ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఒక వరుసలో నిలబడిన పార్టీ శ్రేణులు

తాడేపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు పర్యటనకు తాడేపల్లి నుంచి రోడ్డు మార్గం ద్వారా తాడేపల్లిలోని తన నివాసం నుంచి బుధవారం బయలు దేరారు. బయలుదేరిన దగ్గర నుంచి ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు అడుగడుగునా ఆయనకు ఘనస్వాగతం పలుకుతూ నీరాజనాలు పలికారు. తాడేపల్లి క్రిస్టియన్‌పేటలో మహిళలు బయటకు వచ్చి స్వాగతం పలకడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారు దిగి అభివాదం చేశారు. ప్రాతూరు కుంచనపల్లి అండర్‌పాస్ వద్ద వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్), వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు మేకా వెంకట రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, తాడేపల్లి రూరల్ కన్వీనర్ అమరా నాగయ్య, మంగళగిరి రూరల్‌పార్టీ అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు.

స్వాగతం పలికి కార్యకర్తలు..

వైఎస్ జగన్ రాక కోసం ఒక లైన్‌లో నాయకులు, కార్యకర్తలు నిలబడి ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వైఎస్ జగన్ ప్రాతూరు అండర్‌పాస్ వద్దకు రావడంతో ఆయనను చూసేందుకు పార్టీ శ్రేణులు రోడ్డు మీదకు వచ్చారు. వైఎస్ జగన్ కారు దిగి అందరికీ కరచాలనం చేసి అభివాదం చేశారు. అనంతరం మంగళగిరి నియోజకవర్గ విద్యార్థి విభాగం నాయకులు పులగం సందీప్‌రెడ్డి కాన్వాయ్ వెంట ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి టోల్‌గేటు వద్దకు వెళ్లిన కాన్వాయ్‌నకు కార్యకర్తలు స్వాగతం పలికారు.

అభిమానులకు అభివాదం..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ వద్దకు చేరుకున్న అభిమానులకు అభివాదం చేశారు. అందరినీ సమన్వయంగా కలుపుకొంటూ రోడ్డు మార్గంలో సత్తెనపల్లి బయలు దేరారు. కార్యక్రమంలో తాడేపల్లి రూరల్ మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, నియోజకవర్గ జేసీఎస్ మాజీ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిలకా మధు, కళ్లం పిచ్చిరెడ్డి, ఉంద్రు కళ్యాణ్, మిరియాల రాంబాబు, గొడవర్తి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ మాజీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోరలు చాస్తున్న కాల్‌మనీ

- యువకులు, మహిళలే టార్గెట్
- రూ.100 10 నుంచి 40 రూపాయల వడ్డీ
- లబోదిబోమంటున్న బాధితులు



తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో కాల్‌నాగులు బుసలుకొడుతున్నాయి. అవసరానికి డబ్బు తీసుకున్న పాపానికి సామాన్యులను నిత్యం అవి కాటేస్తున్నాయి. అసలుకు నాలుగింతలు వడ్డీ వేసి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నాయి. అప్పు తీసుకున్న వారి అవసరాన్ని ఆసరాగా తీసుకుని రెచ్చిపోతూ మానవత్వం మరచి వారిపట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నాయి. బాధితులు ఇళ్లు, ఊరు విడిచి పారిపోయేలా చేస్తున్నాయి. సామాన్య ప్రజలు, కూలీలు వడ్డీ జలగల వలలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏకంగా బాధితుల ఇళ్లపైకి వెళ్లి దాడులకు పాల్పడుతున్నారు. నగదు చెల్లించకపోతే ఇంటికి తాళాలు వేసి బాధితులను ఇంటి నుంచి బయటకు గెంటేస్తున్నారు. తమకు జరిగిన అన్యాయంపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బాధితులకు న్యాయం చేయకపోగా.. కోర్టులో తేల్చుకోండి అంటూ పోలీసులు చెబుతుండడం గమనార్హం.

నూటికి రూ.15 వడ్డీ..

ఉండవల్లి సెంటర్‌లో నివాసం ఉండే ఓ లారీ డ్రైవర్ కుమారుడికి మంగళగిరికి చెందిన ఓ యువతి యువకుడి బండి తాకట్టు పెట్టుకుని రూ.30 వేలు కాల్‌మనీగా అప్పు కింద ఇచ్చింది. రెండు నెలల అనంతరం రూ.55 వేలు ఇవ్వాలంటూ ఆ యువకుడి ఇంటికి వచ్చి ఆమె గొడవ చేసింది. ఆ యువకుడి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా పోలీసులను ఆ యువతి బెదిరించింది. చేసేదేమీ లేక ఆమె కాళ్లావేళ్లా పడి రూ.30 వేల అప్పుతో పాటు రూ.10 వేలు అదనంగా ఇచ్చి బండి తెచ్చుకున్నారు. అంటే సుమారు నెలకు నూటికి రూ.15 వడ్డీ పడినట్లు. మంగళగిరి రత్నాల చెరువు కట్టను అడ్డాగా చేసుకుని ఈ వడ్డీ వ్యాపారం నడుపుతోందని.. ప్రభుత్వం తనకు కేటాయించిన టిడ్కో నివాసాల వద్ద తన దగ్గర తాకట్టు పెట్టిన వాహనాలతో పాటు ఇతర వస్తువులను, ప్రాంసరీనోట్లను, చెక్కులను భద్రపరిచినట్లు విశ్వసనీయ సమాచారం.

చిరువ్యాపారులే టార్గెట్‌గా..

నులకపేటకు చెందిన ఒక చిరువ్యాపారి అధిక వడ్డీకి నగదు తీసుకుని వడ్డీ వ్యాపారుల ఒత్తిడి తట్టుకోలేక ఊరు వదిలి వెళ్లిపోయారు. మంగళగిరిలో ఓ బ్యాంక్‌కు బురిడీ కొట్టి కోట్ల రూపాయల నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టిన ఓ వ్యక్తి నులకపేటలో తాపీ మేస్త్రీలు, కూలీలను టార్గెట్ చేసి వారికి రూ.10 వేలు నగదు ఇచ్చి అందులో ఆఫీస్ ఖర్చులంటూ రూ.1000 మినహాయించుకుంటాడు. ఆ రూ.10 వేలకు వారానికి రూ.600 వడ్డీ కింద వసూలు చేస్తున్నారు. సదరు అప్పు ఇచ్చిన వ్యక్తికి శనివారం సాయంత్రం డబ్బులు ఇవ్వకపోతే ఆది వారం రూ.400 వేసి రూ.1000 కట్టాల్సిందే. లేకుంటే అప్పు తీసుకున్న వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల ముందే ఇంట్లో మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడుతాడు. ఉండవల్లిలో పెద్ద మనుషులుగా చలామణి అవుతూ వివిధ పార్టీల అండదండలతో ఈ కాల్‌మనీ వ్యాపారం చేసేవారు కోకొల్లలు.

అప్పు తీసుకున్నవారి కొత్త దందా..

కాల్‌మనీ వ్యాపారస్తుల వడ్డీ దందా ఈ విధంగా ఉంటే, రైతు వారీగా రెండు రూపాయలు, రూపాయిన్నర వడ్డీకి ఇచ్చిన వారి పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. తీసుకున్న వ్యక్తులు తమ రాజకీయ పలుకుబడి, ఇతర నాయకులు, పోలీసుల పలుకుబడులు ఉపయోగించి బెదిరింపులకు పాల్పడుతున్నారు. అవసరమైతే ఎవరో ఒకరితో పోలీస్‌స్టేషన్ దగ్గర హడావుడి చేయించి సదరు వ్యక్తిపై కాల్‌మనీ కేసు నమోదు చేయిస్తున్నారు. మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎర్రబాలెంకు చెందిన ఓ యువకుడు ఇదే రకంగా బెదిరించడంతో నాకు ఇవ్వాల్సిన రూ.10 లక్షలు, వడ్డీ అవసరం లేదంటూ పోలీస్‌స్టేషన్‌లో అప్పు తీసుకున్న వ్యక్తి కాళ్లు పట్టుకుని వెళ్లిపోయాడు. నా కుమార్తె వివాహం కోసం డబ్బులు దాచుకున్నానని.. వడ్డీకి ఆశ పడి ఇస్తే ఇంత దుర్మార్గంగా నాపై కాల్‌మనీ కేసు పెట్టాడంటూ అప్పు ఇచ్చిన వ్యక్తి కన్నీరుమున్నీరు అవుతూ పోలీస్‌స్టేషన్ నుంచి వెళ్లిపోయారు.

యోగాంధ్ర పోటీల విజేతలకు అభినందనలు


విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

తాడికొండ: రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన రావెల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అభినందించారు. బుధవారం తాడికొండలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులు పి.వెంకట త్రివేణి, పి.భార్గవి, ఎం.అక్షయ, ఎ.పూజిత, బి.అనూషలను అభినందించిన ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మయ్య, ఎంపీడీవో కె.సమతావాణి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనండి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బీఎం లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: యోగాంధ్ర కార్యక్రమాలలో అందరు పాల్గొనాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా పట్టణంలోని అనేక ప్రాంతాలలో యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం మార్కెట్‌లోని అన్నాబత్తుని సత్యనారాయణ పురవేదిక వద్ద 500 మంది విద్యార్థులతో యోగాంధ్ర ఆకృతిని ప్రదర్శించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

మేడికొండూరు: రోడ్డుపై ఎదురెదురుగా వెళుతున్న ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పేరేచర్ల రోడ్డులోనిలక్ష్మీనరసింహ కాలనీ వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా మాచవరానికి చెందిన జి.మణికంఠ ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి సత్తెనపల్లి వైపు వెళుతున్నాడు. మేడికొండూరు నుంచి గుంటూరు వైపు ప్రయాణికులతో వెళుతున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సహాయంతో క్షతగాత్రుడిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురికి స్వల్ప గాయాలు

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో నలుగురు స్వల్పంగా గాయపడిన ఘటన నగర పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట కాజ పరిధిలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు ద్విచక్రవాహనాలపై ఉన్న నలుగురు కింద పడి స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారికి వెంటనే ఆసుపత్రికి తరలించారు.

పంట పొలంలో మహిళపై దాడి



తెనాలి: తమ పంట భూమిలో దుక్కి దున్నించడానికి వెళ్లిన ఇరువురిపై దాడి జరిగిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... అమృతలూరు మండల పరిధిలోని మూల్పూరులో తెనాలికి చెందిన వేములపల్లి రజని, తన సోదరుడి కుమారుడు వెనిగళ్ల సునీల్ కుమార్‌లతో కలిసి పొలంలో దుక్కి పనులకు వెళ్లారు. మూల్పూరుకు చెందిన యలవర్తి భూషయ్య, మరికొందరు తమపై దాడికి దిగి హత్యాయత్నం చేశారని ఆరోపిస్తూ తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. అనంతరం తమ పై జరిగిన దాడి ఘటనపై తెనాలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని బాధితులు కోరారు.

బాంబు దాడులను విరమించాలి

దుగ్గిరాల: గాజా పాలస్తీనాపై ఇజ్రాయిలు చేసే బాంబు దాడులను వ్యతిరేకిస్తూ బుధవారం జెండా చెట్టు వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మిక నాయకులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ.. ఇజ్రాయిలు అమెరికా అండతో గాజా పాలస్తీనాపై బాంబు దాడులు చేసి పిల్లలను సైతం చంపుతున్నారని విమర్శించారు. అంతర్జాతీయ నిబంధనను కూడా ఉల్లంఘించి ప్రజల ప్రాణాలను తీస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ సుభాని, జి.శ్రీనివాసరావు, వై.బ్రహ్మేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మోటూరికి ఘన నివాళులు

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో మోటూరి హనుమంతరావు 24వ వర్ధంతిని బుధవారం సీపీఎం నాయకులను నిర్వహించారు. హనుమంతురావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ప్రజలకు చేసిన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో కొంగర రాఘవయ్య, మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, జి.వేంకటేశ్వరరావు, కె.వెంకటరావు, కె.కోటేశ్వరరావు, జి.నతానియేలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృథాగా పోతున్న తాగునీరు!



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి హరిజనవాడలో వాటర్ ట్యాంక్ సమీపంలో పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోంది. బుధవారం ఉదయం తాగునీరు పైప్ లైన్ నుంచి లీక్ అయిన నీరు సిమెంట్ రోడ్డుపై పారి డ్రైనేజీలో కలుస్తోంది. గత ఐదు రోజుల నుంచి ఈ పైప్‌లైన్ లీక్ అవుతోందని.. నివాసాల్లోకి వెళ్లే పైపులైనును గుర్తుతెలియని వారు ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని.. సచివాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు తెలియజేస్తున్నారు.

పట్టణ పోలీస్‌స్టేషన్‌కు రెండు ద్విచక్రవాహనాలు



మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు గుంటూరు జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు రెండు ద్విచక్రవాహనాలను కేటాయించారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణ సీఐ వీరాస్వామి మాట్లాడుతూ.. వాహనాల భద్రతా చర్యలకు, ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడం కోసం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ రెండు ద్విచక్రవాహనాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ వాహనాలు నేరాల నియంత్రణ, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు ఉపయోగపడతాయని అన్నారు. ఈ వాహనాలను సిబ్బందికి కేటాయించామని తెలిపారు.

డయేరియా నియంత్రణపై అవగాహన

ఫిరంగిపురం: డయేరియాపై ప్రజలకు అవగాహన అవసరమని వైద్యాధికారి శ్వేత అన్నారు. మండలంలోని 113.తాళ్లూరు, శిరంగిపాలెం, తక్కెళ్లపాడు, అమీనాబాద్, వేములూరిపాడు, ఫిరంగిపురం, రేపూడి, గొల్లపాలెం గ్రామాల్లో డయేరియా నియంత్రణపై బుధవారం ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వేడినీరు తాగాలని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. డయేరియా వ్యాధికి గురైన వారు త్వరగా నీరసించి పోతారని.. చిన్నారులు పాలు తాగేందుకు ఆసక్తి చూపరని చెప్పారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటిలో కలిపే విధానం, దానిని వయస్సుల వారీగా వాడుకునే పద్ధతి గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ షేక్ అబ్దుల్ రెహమాన్, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత ఆలయ వార్షికోత్సవం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, నగరేశ్వర స్వామి ఆలయ ఏడో వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు రాజేంద్ర శర్మ ఆలయ ముఖమండపంలో గణపతిపూజ, మండపారాధన, పుణ్యాహవాచనం, అఖండస్థాపన, నవగ్రహ మండపారాధన, ప్రధాన కలశావాహన పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శ్రీసిద్ధి, బుద్ధి సమేత గణపతిస్వామి, వల్లీ దేవసేనా సమేత కుమారస్వామి, వింధ్యావాసినీ సమేత నగరేశ్వరస్వామి వార్లకు శాంతి కల్యాణాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలో ఉంచి గీతాభజన మండలి ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ డి.నరేంద్రకుమార్, కొత్తమాసు వెంకటేశ్వర్లు, మధులు పర్యవేక్షించారు.

కిల్కారి కాల్ సేవలపై అవగాహన

మంగళగిరి టౌన్: కిల్కారి మొబైల్ సేవలను వినేలా గర్భిణులు, బాలింతల్లో అవగాహన కల్పించాలని కిల్కారి ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు అన్నారు. మంగళగిరి మండల పరిధిలోని నూతక్కి యూపీహెచ్‌సీలో కిల్కారి కాల్స్‌పై ఆశాలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందికి బుధవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణీగా ఉన్న 4వ నెల నుంచి బిడ్డ పుట్టిన ఏడాది వరకు ఎలాంటి చర్యలు తీసుకోవలన్న దానిపై కిల్కారిలో అవగాహన కల్పిస్తారని.. ఇది పూర్తిగా ఉచితమని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీ నారాయణ, సీహెచ్‌వో ఎంవీ రమణ, హెచ్ఎస్ సతీష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలంటూ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు పారిశుద్ధ్య కార్మికులకు అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ప్రాతూరు జాతీయ రహదారి వద్ద పారిశుద్ధ్య కార్మికులు నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మురుగునీరు నిల్వ ఉండకుండా, వీధులను శుభ్రం చేస్తూ సేవ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు పేదవారేనని.. ప్రభుత్వ ఉద్యోగులు అనే సాకుతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకం పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు వర్తింపజేయక పోవడం దారుణమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలన్నీ పారిశుద్ధ్య కార్మికులకు అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఏపీ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి మేకల డేవిడ్, పారిశుద్ధ్య కార్మికులు కృష్ణతులసి, కొక్కలిగడ్డ ఝాన్సీ, కోటేశ్వరి, రాంబాబు, చిన్నప్ప, వెంకటేశ్వరమ్మ, అంజి, జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మంగళగిరి: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు బాబు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం నగర పరిధిలోని ఆత్మకూరు నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను బాబు విస్మరించి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వెంటనే పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆకురాతి రాజేష్, నాలి వెంకట కృష్ణ, మునగాల మల్లేశ్వరరావు, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, ఈపూరి ఆదామ్, బొమ్ము సాంబిరెడ్డి, గుంటి రాజ్యలక్ష్మి, నాగమణి, సలోమి, తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటంలో కమిషనర్ విస్తృత పర్యటన


ఇప్పటంలో పర్యటిస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటంలో రూ.5 లక్షల వ్యయంతో చెరువు చుట్టూ రహదారి నిర్మిస్తున్నామని అన్నారు. ఇప్పటం ప్రధాన రహదారిలో వాహనాల వేగ నియంత్రణ కోసం అక్కడి ప్రజలు స్పీడ్ బ్రేకర్లు వేయమని కోరారని, వాటిని కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో తాగునీటి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఏఈ రామమోహనరావు, డీఈ రాము, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న పసుపు ట్రేడర్స్ నాయకులు

దుగ్గిరాల: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో గతేడాది జరిగిన అగ్ని ప్రమాదంలో బాధిత రైతులతో పాటు వ్యాపారులకు(ట్రేడర్స్) కూడా నష్ట పరిహారం అందించాలని పసుపు ట్రేడర్స్ నాయకులు కోరారు. దుగ్గిరాలలో బుధవారం పసుపు మార్కెట్ యార్డు సెక్రెటరీ జేవీ సుబ్బారావుకు ఈ సందర్భంగా వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ.. 2024 జూలై 10న రాష్ట్ర మార్కెట్ ఫెడ్ ప్రధాన కార్యాలయం విజయవాడలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం, పసుపు రైతులు, వ్యాపారులు, ఇన్సూరెన్స్ ప్రతినిధుల సమక్షంలో జరిగిన సమావేశంలో క్వింటాకు రూ.7 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించే విధంగా ఒప్పందం కుదురిందని అన్నారు. ఒప్పందం ప్రకారం పరిహారం ప్రభుత్వం ముందు రైతులకు చెల్లించి.. తరువాత వ్యాపారులకి చెల్లించేట్లు భావిస్తోందని తెలిపారు. ప్రమాదంలో 14 మంది వ్యాపారులు 25 వేల బస్తాలను నష్టపోయారని.. రైతులతో పాటు తమకూ పరిహారం ఇవ్వాలని అన్నారు. ఇటీవల గుంటూరు కలెక్టర్, తెనాలి సబ్ కలెక్టరుకు సమస్యపై వినతిపత్రం ఇవ్వగా అది పరిశీలనకు వచ్చిందన్నారు. విచారణ నిమిత్తం పసుపు యార్డు సెక్రెటరీకు రాగా వారికి సమస్యను వివరించి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు ట్రేడర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, టి.ప్రసాద్, డి.నాగార్జున, పి.రంగయ్య, పి.దేవేంద్రనాథ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను తక్షణం పరిష్కరించాలి


కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు బుధవారం నాటికి 197వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో షేక్ సుభాని, గురవయ్య, సుబ్బారావు, పిచ్చయ్య, బి.సూర్యప్రకాశరావు, ఆరిఫ్, ఇమాంబీ, శారద, రమణ, సారమ్మ, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో కార్మికులకు షాక్

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కేబీ ప్రసాద్


మాట్లాడుతున్న కేబీ ప్రసాద్

తెనాలి: విద్యుత్ రంగంలో ఆదాని స్మార్ట్ మీటర్ల ద్వారా పాలకులు అప్రకటిత సంస్కరణలు అమలు చేయాలని చూస్తున్నారనీ, వీటి ప్రభావంతో రాబోయే రోజుల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్స్ స్కీం కార్మికుల జీవితాలు దుర్భరంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం యూనియన్ గౌరవ అధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. కేబీ ప్రసాద్ మాట్లాడుతూ, కరువు భత్యం అమలు జరగని కార్మికులకు పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా వేతనాలను ప్రభుత్వం చెల్లించదని చెప్పారు. స్మార్ట్ మీటర్లతో విద్యుత్ చార్జీల పెంపు భారాన్ని ప్రజలు మోయాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యుత్ చార్జీల పెంపు జరిగితే అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు ఇంటి అద్దెలు కూడా పెరుగుతాయని గుర్తు చేశారు. దీంతో కార్మికుల అప్పుల ఊబిలో కూరుకుపోయి వారి జీవితాలు దుర్భరంగా మారతాయని చెప్పారు. ఎం.దుర్గా ప్రసాద్, వి.లక్ష్మీనారాయణ, ఎం.నాగేశ్వరరావు, గోపి, శ్రీనివాసరావు, భాస్కర్, సుధాకర్, మరియమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.